నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- 10న తుది గడువు, 13న స్క్రూటినీ
- 15న నామినేషన్‌ల ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు
- అభ్యర్థులు, వారితోపాటు వచ్చేవారు నిబంధనలు తప్పక పాటించాలి
- ముషీరాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ



ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన గట్టమైన నామినేషన్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 10వ తేదీ వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ముషీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనారాయణతో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: నామినేషనల్‌ల ప్రక్రియ ఎప్పటి నుంచి ఎప్పటి వరకు కొనసాగుతుంది?

జవాబు: నంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌లను స్వీకరించడం జరుగుతుంది. పబ్లిక్ హాలిడేస్‌లో నామినేషన్‌లు స్వీకరించరు.

ప్రశ్న: నామినేషన్ ఫీజు ఎంత?

జవాబు: నామినేషన్‌కు రూ. 10 వేలుగా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ. 5 వేలు. నగదు రూపంలో గానీ, చలాన్‌ల రూపంలో గానీ చెల్లించవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

ప్రశ్న: ఒక్కో అభ్యర్థి ఎన్ని సెట్ల నామినేషన్‌లు వేసుకోవచ్చు?

జవాబు: నామినేషన్ దాఖలు చేసే ప్రతి వ్యక్తి నాలుగు సెట్‌ల నామినేషన్‌లు వేసుకోవచ్చు. అవి విడివిడిగా గానీ, ఒకేసారి గానీ అందజేయవచ్చు.

ప్రశ్న: రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయం ఎక్కడ.. ఎంతమందిని అనుమతిస్తారు?

జవాబు: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయమే రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంగా ఈ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కొనసాగుతుంది. ఇక్కడే ఔత్సాహికులు నామినేషన్ దాఖలు చేసుకోవాలి. అభ్యర్థితో పాటు మరో నలుగురు (మొత్తం ఐదుగురు) మాత్రమే అనుమతిస్తారు. కార్యాలయానికి వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ర్యాలీగా వచ్చిన అందరూ వంద మీటర్ల బయటే ఉండాలి.

ప్రశ్న: దరఖాస్తును నింపడానికి సహాయ సహకారాలు అందిస్తారా?

జవాబు: రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశాం. అక్కడ నామినేషన్ పత్రాలు ఇవ్వడమే కాకుండా ఆ పత్రాలను నింపడానికి సహకారం కూడా సిబ్బంది అందిస్తారు. అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు కాల్ సెంటర్ నెంబర్ 040-276 60376లో సంప్రదించవచ్చు.

ప్రశ్న: ప్రస్తుతం అభ్యర్థులు చేస్తున్న ప్రచారం ఖర్చు దేని కిందకు వస్తుంది?

జవాబు: గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల ఖర్చు 15వ తేదీ వరకు పార్టీ ఖర్చు కింద జమ అవుతుంది. ఒకవేళ అదే అభ్యర్థికి బీ ఫాం అందినట్‌లైతే ఆ ఖర్చును అభ్యర్థి ఖాతాలో జమ చేయబడుతుంది.

ప్రశ్న: గుర్తుల కేటాయింపు ఎప్పుడు?

జవాబు: 10వ తేదీన నామినేషన్‌ల ముగింపు, 13న స్క్రూటినీ, 15న నామినేషన్‌ల ఉపసంహరణ జరుగుతుంది. ఆ తరువాత అదే రోజు గుర్తుల కేటాయింపు కూడా జరుగుతుంది.

ప్రశ్న: ప్రస్తుతం ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయి?

జవాబు: 274 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా 1600 ఓట్లకు పైన 10 పోలింగ్ కేంద్రాలు ఉండడంతో వాటిని రెండుగా విభజించడం జరిగింది. దీంతో 284 పోలింగ్ స్టేషన్‌లు అయ్యాయి. 106 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న: ఇతర అధికారులు ఎవరెవ్వరు ఉన్నారు?

జవాబు: లా అండ్ ఆర్డర్ నోడల్ ఆఫీసర్‌గా చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా జీహెచ్ఎంసీ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ముషీరాబాద్ తహసీల్దార్, ఏఎంసి జాకీర్ హుస్సేన్‌లు ఇతర ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

గజల్ క్వీన్ మల్లేశ్వరికి ప్రపంచ రికార్డులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సుప్రసిద్ధ గజల్ కవియత్రి, తొలి తెలుగు గజల్ వాగ్గేయకారిణి రాజా వాసిరెడ్డి మల్లేశ్వరి చేసిన విశేష కృషికి గుర్తింపు చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నుంచి రెండు విశిష్ట రికార్డులు లభించాయి. భారత దేశ గజల్ చరిత్రలో ఈ రికార్డులు సాధించిన మొదటి గజల్ కవియత్రిగా ఆమె పేరు నమోదైనట్లు గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మల్లేశ్వరి రాసిన పది గజల్ సంకలనాలకు ఛాంపియన్ ఆఫ్ గజల్ రికార్డు లభించింది. ఆమె రాసిన మొదటి గజల్ కావ్యం మోహనలోని 50 గజల్‌లను గానం చేశారు. ఈ గజల్‌లను జీకే తెలుగు టాకీస్ దృశ్యరూపంగా ఆవిష్కరించారు. అందుకు ఛాంపియన్ ఆఫ్ క్రియేటివిటీ అన్న ప్రపంచ రికార్డు వరించినట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమెకు కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ, సామాజికవేత్త జీవన్‌లాల్ లవాడియా, సూరారం శంకర్, చల్లా రాంబాబు, మంజుల, లక్ష్మీభవానీ, శాంతి నిర్మల, రాఘవ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూస రాజు

ముషీరాబాద్: ఎన్నో రోజుల ఎదురు చూపులకు ఎట్టకేలకు తెరపడింది. హేమాహేమీలను కాదని అనూహ్యంగా తెరపైకి వచ్చిన పూస రాజు పేరును ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది. పూస రాజు ప్రస్తుతం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులుగా, అండమాన్, నికోబార్ దీవుల ఓబీసీ మోర్చాకు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ కె.లక్ష్మణ్‌కు అత్యంత సన్నిహితుడు. మొదట టీఆర్ఎస్‌లో ఉన్న పూస రాజు 2018లో బీజేపీలో చేరారు. తండ్రి పూస స్వామి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. 1967లో రాంనగర్ కౌన్సిలర్‌గా పని చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముషీరాబాద్ కాంగ్రెస్ టికెట్ ఆశించినా టికెట్ రాకపోవడంతో ఆయన హౌసింగ్ బోర్డు చైర్మన్‌గా నియమించారు. ఒక సోదరుడు పూస శ్రీకృష్ణ కూడా కాంగ్రెస్ నుంచి భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశారు.

నియోజకవర్గం: ముషీరాబాద్

ప్రొఫైల్



పేరు: పూస రాజు
భార్య: పూస లావణ్య
సంతానం: ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు
తల్లిదండ్రులు: పూస స్వామి, పూస సత్తెమ్మ
పుట్టిన తేదీ: 1971, అక్టోబర్ 22
విద్యార్హత: బీఈ
ప్రస్తుత హోదా: ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు



జెమిని కాలనీలోని తన నివాసం వద్ద సంబరాలు జరుపుకొంటున్న కుటుంబ సభ్యులు

బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్ ప్రస్థానమిలా..



అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గం నుంచి సి.కృష్ణయాదవ్ బీజేపీ టికెట్ దక్కించుకున్నారు. ఇతను కార్పొరేటర్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్, మంత్రిగా ఎదిగారు. పుట్టి పెరిగింది అంతా ఓల్డ్ సిటీ లాల్‌దర్వాజ. 1980-85లోనే ఇంటర్‌లో విద్యార్థి నాయకుడిగా అయ్యారు.

- ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ, ఎల్ఎల్‌బీ విద్యను అభ్యసించారు.
- 1986లో ఆలియాబాద్ నుంచి జీఎచ్‌హెంసీ కార్పొరేటర్‌గా టీడీపీ తరుపున ఎన్నికయ్యారు.
- 1992-94 మధ్యలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- 1994-98 హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ విప్‌గా నియమించారు.
- 1998-99 వరకు పశుసంవర్ధన శాఖ మంత్రిగా పనిచేశారు.
- 1999-2001 వరకు కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు.
- 1999-2004 వరకు రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 2015-16 వరకు టీడీపీ జీఎచ్ఎంసీ అధ్యక్షుడిగా పనిచేశారు
- 2016లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు
- 2023లో బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి బీజేపీలో చేరారు.
- 2023లో బీజేపీలో చేరిన నెల రోజుల్లో అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ టికెట్ వరించింది.

మహిళా సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, మహిళల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం భవనంలో స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ హాజరుకాగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టి పేద, మధ్య తరగతి ప్రజలను సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని అన్నారు. ఎన్నికలప్పుడు కనిపించే కాంగ్రెస్, బీజేపీ నేతలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, పార్టీ నాయకులు ఎక్కా కన్నా, షరీఫ్, రెబ్బరామారావు, రహీం, జునేద్‌బాగ్దాదీ, వంగాల నర్సింగ్‌రావు, నజీర్, మగ్బూల్, జబ్బార్, ఎల్లేష్, సాయి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు...

భోలక్‌పూర్ డివిజన్ పఠాన్‌బస్తీలో ముస్లింలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రెబ్బ రామారావు, షాహెద్, సయ్యద్ షకిల్, రహీం, సయ్యద్ అహ్మద్ భక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయాదవ్‌కు సన్మానం



కృష్ణాయాదవ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సి.కృష్ణయాదవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. అభ్యర్థిగా తన పేరు ప్రకటించిన వెంటనే గురువారం నల్లకుంట కార్పొరేటర్ వై.అమృతను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను కార్పొరేటర్ అమృత శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీఆర్ఎస్ నేత గణేష్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేసిన శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు గణేష్ పక్షవాతంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకోని నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం ముషీరాబాద్‌లోని బాపూజీ నగర్‌లోని గణేష్ నివాసానికి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తన బృందంతో వెళ్లి ఆయన ఆరోగ్య విషయం తెలుసుకోని ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు భిక్షపతి యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు అజయ్ ముదిరాజ్, నేత శ్రీనివాస్, వీరస్వామి, కార్తీక్ యాదవ్, బిజ్జి వెంకటేశ్వరరావు, బాలరాజుగౌడ్, సిరిగిరి శ్యామ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి



ఓయూ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి

నల్లకుంట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి జోష్యం చెప్పారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఆయన ఓయూ ఎన్‌సీసీ గేట్ వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన ఓయూ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసిన ఆయన కాంగ్రెస్‌కు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని వాకర్స్‌ని కోరారు. కార్యక్రమంలో గ్రేటర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి, గ్రేటర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్ కుమార్, సీనియర్ నాయకులు సి.ధనార్జన్ రెడ్డి, అజయ్ కుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రవి, అనంతం, లింగమయ్య, కృష్ణా రెడ్డి, నాగేందర్, జంగమయ్య, ఓమ్ రెడ్డి, రవి, మధు, సుధాకర్, విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లికి చెందిన లోక్యానాయక్, గోపిలతో పాటు పలువురు బీజేపీ నాయకులు గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు(బబ్లూ), టెంపుల్ జనార్ధన్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తమ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీ యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మోజెస్, ఎం.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఎ.కిషన్‌రావు, వి.నాగభూషణం, ఎస్.రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం

కాచిగూడ: పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ సీనియర్ న్యూట్రీషనిస్ట్ వై.శ్రీదేవి అన్నారు. బర్కత్‌పురలోని శ్రీమతి ఎ.శ్యామల దేవి మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, డాక్టర్ శ్రీరంగ్ అబ్కారి, సందీప్త, డాక్టర్ డి.వసుంధర, హామీదాబీ, అనుపమ, డాక్టర్ పిఆర్ మేఘనాథన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా టికెట్ సాధించిన కృష్ణయాదవ్

అంబర్‌పేట్: నగర రాజకీయాలను ఒకప్పుడు ప్రభావితం చేసిన మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్‌కు అనుహ్య పరిణామాల మధ్య అంబర్‌పేట బీజేపీ టికెట్ వరించింది. బీజేపీ గురువారం ప్రకటించిన జాబితాలో కృష్ణయాదవ్ పేరు ప్రకటించింది. కృష్ణ యాదవ్ ఇటీవలే బీఆర్ఎస్ పార్టీలో నుంచి బీజేపీలో చేరారు. కృష్ణ యాదవ్‌కు అంబర్‌పేట నియోజకవర్గానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. అంబర్‌పేట ప్రాంతం భాగమైన హిమాయత్‌నగర్ నియోజకవర్గం నుంచి 1994, 99లో వరుసగా రెండు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. రెండు సార్లు మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కొన్ని పరిణామాలతో రాజకీయాలకు దూరమయ్యారు. 2009లో ఎన్నికల్లో పోటి చేసి ఓడిపోయారు. నగర రాజకీయాల్లో ఒక దశలో క్రియాశీల పాత్ర పోషించారు. తాజాగా బీజేపీ నుంచి టికెట్ తెచ్చుకుని బరిలో నిలవనున్నారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి: మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దుబాయ్‌లోని వొకా హోటల్‌లో స్వతంత్ర భారతికి తెలంగాణ సంగీత హారతి పేరిట నిర్వహించిన సంగీత విభావరి అలరించిందని సంస్థ నిర్వాహకుడు బాపుశాస్త్రి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన వివేక్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. గాయనీమణులు దివ్యకాంతి, శ్వేత, ప్రశాంతి, ప్రగతి తదితరులతో కలసి బాపుశాస్త్రి, నటుడు సాయికిరణ్‌లు ఎంపిక చేసుకున్న హిందీ, తెలుగు పాటలను అలపించి శ్రోతలను అలరించారన్నారు.ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అంతర్జాతీయ మనీషా పురస్కారాలను ప్రదానం చేశామన్నారు. ప్రముఖులు డాక్టర్ టీఆర్‌కేరావు, టి.రామకుమార్, వీరభద్ర, ఆర్‌సీఎం రాజు, వెంకటేశ్‌గుప్తా, శ్రీనివాస్, శశిధర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి

ముషీరాబాద్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్



సంజీవ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్, మహాత్మానగర్, సంజీవ్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడటంతో పాటు కుటుంబ పాలనను కొనసాగిస్తున్నదని విమర్శించారు. రాహుల్‌గాంధీ మేటిగడ్డ ప్రాజెక్టు చేసి నిర్మాణంలో జరిగిన అవినీతిని బయటపెట్టారని అన్నారు. గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు ముషీరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశానని ఆ అభివృద్ధే రాబోయే ఎన్నికల్లో ముషీరాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, గ్రేటర్ ఉపాధ్యక్షులు మేడి సురేష్‌కుమార్, నియోజకవర్గం యూత్ కమిటీ అధ్యక్షుడు సంగపాక వెంకట్, నాయకులు మురళీమోజెస్, నక్క కృష్ణాగౌడ్, రఘు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీల మాయమాటలను నమ్మొద్దు'



అడిక్‌మెట్‌లో ఓ కేఫ్ వద్ద టీ తాగుతున్న ముఠా గోపాల్, ఎం.ఎస్.ప్రభాకర్, కన్నా

ముషీరాబాద్: కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను రెండవసారి గెలిపించాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ కోరారు. గురువారం అడిక్‌మెంట్ డివిజన్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం చేశారు.ఈ సందర్భంగా గోపాల్, ఎమ్మెల్సీ ప్రభాకర్, యువజన నాయకుడు ముఠా జైసింహ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అడిక్‌మెట్, కట్టంబాయి బస్తీ, ఫ్లైఓవర్, వడ్డెర బస్తీ, పోచమ్మ బస్తీ, లలితానగర్, రాంనగర్‌గుండూ, విద్యానగర్, సత్యనగర్ ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి మరోసారి కేసీఆర్ నాయకత్వ బలపరచాలని ప్రజలను కోరారు. డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ప్ప్రధాన కార్యదర్శి కె.నరేందర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గుప్తా, డి.రవియాదవ్, బొట్టు శ్రీనివాస్, చిట్టి మాదవ్, అస్లాం, నేత శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, భిక్షపతి, అనురాధ, హేమలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో పరిస్థితులు దారుణం



మాట్లాడుతున్న రచయిత్రి కుర్ ఫినా కిమ్ కోవా

హిమాయత్‌నగర్: మణిపూర్‌లో పరిస్థితులు ఇప్పటికీ దారుణంగా ఉన్నాయని, కనీసం మృతదేహాలకు కూడా దహన సంస్కారాలు చేసే పరిస్థితి లేదని మణిపూర్ రచయిత్రి కుర్ ఫినా కిమ్ కోవా ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు, ఆరు నెలలుగా 107 మృతదేహాలు మార్చురీలోనే ఉన్నాయని, వాటిని తీసుకెళ్లే పరిస్థితులు కూడా లేవన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 'రాజకీయ, విద్యా, శాస్త్రీయ' అంశాలపై మూడు రోజుల రాష్ట్ర స్థాయి 'శిక్షణ తరగతులు' హిమాయత్‌నగర్‌లోని మగ్దూం భవన్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కుర్ ఫినా కిమ్ కోవా మాట్లాడుతూ... మణిపూర్ అల్లర్లను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించలేదని విమర్శించారు. మహిళలంతా ఐక్యంగా నిలబడితే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. మణిపూర్ ఘటనలో తమకు సంపూర్ణ మద్దతుగా నిలిచిన భారత మహిళా సమాఖ్యకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా మాట్లాడుతూ మణిపూర్ ఖనిజ సంపదను అదానీకి దోచిపెట్టేందుకే కేంద్రం, మణిపూర్ బీజేపీ ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మణిపూర్ అల్లర్లు పూర్తిగా సద్దుమణిగి, వారికి న్యాయం జరిగే వరకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఉద్యమించాలని అనీరాజా పిలుపునిచ్చారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షులు ఉస్తెల సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఛాయాదేవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షైమీద, లక్ష్మి, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ముషీరాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్, ఎస్ఐ స్వప్న

ముషీరాబాద్: ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సరైన ధ్రువ పత్రాలు లేకుండా నగదు, బంగారం, మద్యం తరలిస్తే వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రోజూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ స్వప్న, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థులను గెలిపించండి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా బీసీలందరూ బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. గురువారం ఆయన కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు జనాభా ప్రాతిపదికన బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలను విస్మరించిన పార్టీలకు ఈ ఎన్నికల్లో తగు గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని అన్ని రాజకీయ పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా కేవలం బీసీలను ఓట్ల కోసం వాడుకునే పార్టీల పట్ల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీజేపీ పార్టీ బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించినంత మాత్రాన సరిపోదని, జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

అంబర్‌పేటలో బీఆర్ఎస్‌కే ప్రజాదరణ



బీఆర్ఎస్‌లో చేరిన నేతలతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గ ప్రజల అండ, ఆశీర్వాదం బీఆర్ఎస్ పార్టీకే ఉందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. తాను గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందన్నారు. గురువారం బాగ్ అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలువురు బీజేపీ, ఇతర పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నేతలు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, ఎర్రబోలు నర్సింహారెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, రమేశ్‌నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేయాలి



కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌ను కలిసిన కృష్ణయాదవ్

కాచిగూడ: అంబర్‌పేటలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ అంబర్‌పేట అభ్యర్థి సి.కృష్ణయాదవ్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం గురువారం కృష్ణయాదవ్ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌ను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేసి అభ్యర్థి సి.కృష్ణయాదవ్‌ను గెలిపించాలని అన్నారు. బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, ఎస్.రవికుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి : ఎమ్మెల్యే కాలేరు



కాచిగూడ: అంబర్‌పేటలో అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని అంబర్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేనంతగా తెలంగాణ అభివృద్ధి చెందిందన్నారు. గురువారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కాచిగూడ డివిజన్ చెప్పల్ బజార్, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నిత్యం మీ మధ్యే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తనకు మరో అవకాశం కల్పించాలని కోరారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయనంత అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజల ఉంది పని చేసేటట్లకు ఓట్లు వేయాలని, చుట్టపు చూపుగా వచ్చిపోయే నేతలను నమ్మవద్దన్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో వందల కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రైలు లోంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: ప్రమాదవశాత్తు నడుస్తున్న రైల్లోనుంచి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ సమాచారం మేరకు... ఫలక్‌నుమా-శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య నడుస్తున్న రైల్లో నుంచి గుర్తుతెలియని వ్యక్తి (50) ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని బాలుడు మృతి



కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని బాలుడు(4) మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా-ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య రైల్లో నుంచి ఓ గుర్తుతెలియని బాలుడు ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.